# ఎన్నిక

— గోగినేని మణి



ప్రజానాయకుడు తిరుపతి రాయుడుగారు......జిందాబాద్! జిందాబాద్!

మన పట్టణం పురోభివృద్ధి సాధించాలంటే.....తిరుపతి రాయుడుగారికే మన ఓటు!

యువజన నాయకుడు రాంబాబు.....వర్థిల్లాలి!'

జయజయధ్వానాల హోరుకు నిద్రలోవున్న తిరుపతిరాయుడుగార్కి చటుక్కున మెలకువ వచ్చింది. లేచి వీధి వరండాలోకి వచ్చారు.

అక్కడ సుమారుగా ఏభైమంది కుర్రాళ్ళు పార్టీజెండాలతో నిలబడి అరుస్తున్నారు. వాళ్ళముందు నాయకుడిలా తన మేనల్లుడు రాంబాబు!

రాంబాబు తిరుపతిరాయుడుగారి దగ్గరకు వచ్చాడు. ఏమిటిదంతా 'అన్నట్లు చూసేడాయన.

"ఎలక్షన్లలో నీకు ప్రచారానికి సాయంగా నేను వద్దామని బయలుదేరుతోంటే, మావూరికుర్రాళ్ళు వాళ్ళూ బయలుదేరి వచ్చేశారు. నేను అవసరం వుండదు వద్దుఅన్నా వినిపించుకోలేదు. వాళ్ళకి నాపైవున్న అభిమానం అలాంటిది." రాంబాబు చెప్పాడు.

ఆ గుంపు మళ్ళీ ఒక్కసారి గొంతులు చించుకుని అరిచారు.

లోపలికి వచ్చాక రాంబాబు తిరుపతి రాయుడుతో మెల్లగా చెప్పాడు —

"మామయ్యా, వీళ్ళ అవసరం మనకి ముందు ముందు ఎంతో వుంటుంది. ఊరేగింపులకి, సభలకి, సభల్లో చప్పట్లు కొట్టటానికి ఇలాంటి వాళ్ళు మనకి కావాలి. అందుకే ముందుచూపుతో వెంటపడి వస్తోంటే' గట్టిగా కాదనలేదు. వాళ్ళకి ఏదైనా ఇచ్చి పంపిస్తే, మళ్ళీ మనం రమ్మన్నప్పుడు వస్తారు"

తిరుపతి రాయుడుగారు మెల్లగా నిట్టూర్చి ఇనప్పెట్టి తెరిచి డబ్బు రాంబాబు చేతుల్లో పెట్టారు. రాంబాబు బయటకు వెళ్ళి వాళ్ళకి డబ్బిచ్చి పంపించేశాడు.

ఆమనుష్యుల్లో చాలామంది ఆ చుట్టుప్రక్కల వాళ్ళేనని, పల్లెనుండి వచ్చినవాళ్ళు కాదనీ తిరుపతిరాయుడుగారికి తెలుసు. కానీ గమనించనట్లుగా వూరుకున్నారు. 'మొత్తానికి తెలివైనవాడే!' అనుకున్నారు తిరపతి రాయుడుగారు రాంబాబు గురించి.

తిరుపతిరాయుడిగారి పినతండ్రి కూతుళ్ళు సరోజమ్మ కాంతమ్మ అక్కడికి దగ్గర్లోనే వున్న పల్లెలో వుంటున్నారు. స్వంతచెల్లెళ్ళు కాకపోయినా ఆయన వాళ్ళపట్ల అభిమానంగానే వుంటాడు. అపుడపుడు చూసి వస్తూంటాడు. వాళ్ళిద్దరికీ కూడా ఒక్కొక్కడే వంశోద్ధారకుడు. ఇద్దరూ పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి సంవత్సరం నుండీ ఉద్యోగాన్వేషణలో ఖాళీగానే వున్నారు. చూపులకి ఇద్దరూ బాగా వుంటారు.

ఆమధ్య పల్లెకు వెళ్ళినపుడు సరోజమ్మ, కాంతమ్మ ఇద్దరూ రాయుడిగారి కుమార్తె తులసిని తమ కోడలిగా చేసుకోవాలనే కోరికను ఆయనకు చూచాయగా తెలియజేశారు. ఆలోచిద్దామనుకుని ఆయన వాళ్ళకు ఏమాటా చెప్పలేదు అప్పటికి.

సరోజమ్మ కొడుకు రాంబాబు. కాంతమ్మ కొడుకు చంద్రం. ఆముందురోజే చంద్రం రాంబాబుని 'మామయ్యకు తోడుగా ఎన్నికల ప్రచారానికి ఈ ఇరవైరోజులూ అక్కడే వుందాం వస్తావా?' అని అడిగాడు. 'చూద్దాంలే' అని వూరుకున్నాడు రాంబాబు.

మామయ్య ఇంటిలో మకాం వేసి తులసి మనసు గెలుచుకోవటానికి ఇది సువర్ణావకాశం అనుకున్నాడు రాంబాబు. చంద్రంతో కలిసి వెళ్ళకుండా తన ప్రత్యేకతను మామయ్యకు తెలియపర్చేట్లుగా వెళ్ళాలనుకున్నాడు. అందుకే కిరాయి మనుష్యులను ఏర్పాటు చేసుకుని 'జై' కొట్టించుకుంటూ మామయ్యగారింటికి వచ్చాడు.

"ఎన్నికల ప్రచారానికని వచ్చి నువ్వే ఓ ఛోటా నాయకుడివైపోయావే" రాయుడుగారు నవ్వుతూ రాంబాబుతో అన్నారు.

"లేకపోతే ఎలా మామయ్యా! రాజకీయాల్లో హంగు, ఆర్భాటానికున్న ప్రత్యేకత నీకూ తెలిసిందేగా! మనమెంతో కంటె మనవెనుక ఎంతమంది వున్నారు అనేదానినిబట్టే మన విలువ పెరుగుతుంది! మరి నా విలువని నువ్వు గుర్తించాలంటే ఇది తప్పనిసరికదా!" నవ్వేస్తూ అన్నాడు రాంబాబు.

రాజకీయ పండితుడిలా చెబుతోన్న మేనల్లుడి వైపు చిరునవ్వులతో ప్రశంసగా చూశాడాయన! అది గుర్తించాడు రాంబాబు!

వచ్చిన రెండురోజులకే అందరి మనస్సులను ఆకట్టుకోగలిగాడు రాంబాబు. చేగోడీల టిఫిను ప్లేటుని విమలమ్మ రాంబాబుకి అందించింది. ఒకటి నోట్లో వేసుకున్నాడు.

"చేగోడీల ఆకారంలో చేసిన ఈ పిండివంట పేరేంటి అత్తయ్యా?" రాంబాబు విమలమ్మని అడిగాడు.

"అదేమిట్రా, చేగోడీలే అవి! ఏం, అలా అడిగావు?" అందావిడ ఆశ్చర్యంగా.

రాంబాబు ఇంకా ఆశ్చర్యపోయాడు.

"వ్వాట్! చేగోడీలా ఇవి?! నేనెపుడో ఒకటి రెండుసార్లు చేగోడీలు తిన్నాను. అవంటే అయిష్టం ఏర్పడి వాటిని ముట్టుకోవటం మానేశానిక. ఈరోజు అసలు వద్దంటే బాగుండదని ఒకటి నోట్లో వేసుకున్నాను. ఇదేదో క్రొత్త పిండి వంటకాబోలు ఇంత కమ్మగా వుందనుకున్నాను. కానీ నువ్వేమో చేగోడీలే అంటున్నావు! అంటే చేసే చేయినిబట్టే రుచి వుంటుందన్న సంగతి తెలిసింది! అత్తయ్యా, నీ చేత్తో చేసిందయితే ఎవరికీ అయిష్టమైంది అంటూ ఏదీ వుండదని గ్యారంటీగా చెప్పగలను!"

"చాల్లేరా కబుర్లు!" ముసిముసినవ్వులతో ఇంకొక ప్లేటు అందించింది మేనల్లుడికి ఆవిడ ఆప్యాయంగా!

ఆరాత్రి భోజనాల దగ్గిరా రాంబాబు అలాగే మాట్లాడాడు. "అత్తయ్యా, అమ్మ వచ్చేముందు అంది 'మీ అత్తయ్యది తన, పర అని లేకుండా భారీగా పెట్టే పెద్దచెయ్యి. నువ్వు తిరిగొచ్చేసరికి ఎంత బరువు పెరుగుతావో అని. అత్తయ్య పెడితే మాత్రం నేను తినగలగాలికదా అనుకున్నాను. కానీ ఇప్పుడు తెలుస్తోంది ఇంత రుచికరంగా చేస్తే తినకుండా ఎలా వుండగలం?"

"చాలు చాల్లే కబుర్లు" అంటూనే మనసులో మేనల్లుడిని చూసి ముచ్చటపడిపోయింది విమలమ్మ. ఆమె వంట బాగానే చేస్తుంది. కానీ ఇంతలా మెచ్చుకున్నవాడు రాంబాబే. కొసరి కొసరి వడ్డించింది.

ఆ మరునాడు తులసి తమ్ముడు గోపీ సినిమాకెళ్ళబోతోంటే రాంబాబు అడిగాడు 'డబ్బులున్నయ్యా.....నేనివ్వనా?'

"వద్దులే బావా అమ్మ పదిరూపాయలిచ్చింది."

"ఏమిటీ! ఇంటర్‌లో కొచ్చిన కాలేజీ కుర్రాడివి. పదిరూపాయలతో సినిమాకెళ్తున్నావా?! అత్తయ్య చాదస్తంగానీ తిరుపతిరాయుడిగారి అబ్బాయికి అంత పొదుపుగా వుండాల్సిన అవసరమేం లేదు! ఇదిగో, ఈ ఇరవై నేనిస్తున్నాను, వుంచుకో" అంటూ రాంబాబు గోపీ మాటల్ని లెక్క చేయకుండా ఇరవై రూపాయల నోటుని జేబులో పెట్టాడు చనువుగా.

'బావ ఎంతమంచివాడు!' గోపీ చూపుల్లోని భావాన్ని గమనించాడు రాంబాబు. ఆడబ్బు అంతకుముందు రోజు తిరుపతిరాయుడు మనుష్యులకు పంచటానికని రాంబాబుకి ఇచ్చినదానిలోదే. ఒక వందరూపాయల నోటును రాంబాబు తనదగ్గిరే వుంచుకున్నాడు.

మెట్లమీద చుట్టకాల్చుకుంటూ కూర్చున్నాడు రాయుడిగారి నమ్మినబంటు నన్నానయ్య. రాంబాబు రావటం



చూసి చుట్టపారేసి లేచి నిలబడ్డాడు.

"ఏమిటిక్కడ కూర్చున్నావ్?" రాంబాబు పలకరించాడు.

"అయ్యగారికోసం చూత్తన్నానండి. ఈయేల మా చంటోడు సర్కస్‌కి తీసుకుపొమ్మని గోల జేశాడండి పొ ద్దు స్న అడుగుదామని చూత్తన్నా"

" మావయ్య ఈ రోజు వచ్చేసరికి బాగా పొద్దు పోవచ్చు. నే చెబుతాలే. వెళ్ళిరా. చిన్న పిల్లాడు ఎదురు చూస్తుంటాడు."

"అయ్యగారేమంటారో...." నసిగాడు.

"నేను చెబుతానంటున్నాగా నీకెందుకు నువ్వు నిశ్చింతగా వెళ్ళు. అంతగా నీవని ఏదయినా వుంటే నేచేస్తాగా. ఈ పదిరూపాయలు తీసుకుని వెళ్ళేటపుడు మీ పిల్లాడికి మిఠాయి పట్టుకెళ్ళు." అంటూ బలవంతంగా పదిరూపాయల నోటిచ్చాడు రాంబాబు నన్నానయ్యకి.

"వయసులో చిన్నోడివయినా ఎంత పెద్దమనసు బాబూనీది" చేతులు రెండూ జోడించి ఆనందంగా అన్న నన్నానయ్య మాటలకు చిన్నగా నవ్వుకున్నాడు రాంబాబు.

పెరటిగుమ్మం మెట్లపై కూర్చుని మల్లెమొగ్గలు మాలకట్టోంది తులసి.

"ఏమిటి ఇందాకటి నుండీ కడ్తున్నావుగానీపూర్తయి నట్లులేదు. నేనుసాయం చెయ్యనా?" అంటూ తులసి ప్రక్కనే కూర్చున్నాడు రాంబాబు. ప్రక్కనే వున్న వళ్ళెంలోని మొగ్గలను రెండు తీసుకుని తులసికి అందించాడు.

"ఇప్పుడేగా మొదలుపెట్టాను. నేతీసుకుంటాలే" అంది మొహమాటంగా

"తులసీ, నేనిక్కడకు వచ్చింది ఎందుకో తెలుసా?" రాంబాబు అడిగాడు.

"తెలును"

"తెలుసా? అయితే నా మనసులోని రహస్యం కనిపె ట్టేశావన్నమాట!"

"అదేమిటి? రహస్యమేముందిందులో! ఎన్నికల ప్రచారానికి సాయంగా వచ్చావంతేగా!" అంది తులసి ఆశ్చర్యపోతూ.

"నేను వచ్చినది ఆ అసలు కారణాన్ని కనిపెట్టేశావు కాబోలు అనుకున్నాను. ఇంతకీ అసలు కారణం చెప్ప మంటావా?"

"చెప్పు....."

"ఈమరదలు మాణిక్యాన్ని ప్రతీరోజు చూసే భాగ్యం ఈకొద్దిరోజులయినా దక్కుతుందని!" స్వరాన్ని మృదు వుగా మార్చి చెప్పాడు రాంబాబు.

తులసికళ్ళు క్రిందికి వాలిపోయాయి.

"బావుంది. నన్ను చూడటం ఓ భాగ్యమా? నేనేమైనా సినిమాతారనా?" చిరునవ్వుతో అంది తులసి.

"సినిమాల్లో తప్ప సినిమాతారల్ని నాలాంటి వాడెవ్వడూ చూడాలనుకోడు. మేకప్ మెరుగులు తీసేస్తే వాళ్ళెందుకు పనికివస్తారు నీముందు?"

తులసి పకపకా నవ్వేసింది. 'ఉండు' పళ్ళెంలోని ఓ పువ్వు తీసి చెవిలో పెట్టుకుని "ఇక చెప్పు నీ కబుర్లు వింటా." అంది కొంటెగా.

రాంబాబు కూడా సరదాగా నవ్వేశాడు. తులసిని చనువుగా తలమీద కొట్టి, చెవిలో పువ్వు తీసి జడలో గ్రుచ్చాడు.

"లేకపోతే ఏమిటిబావా, నీపొగడ్తలు!"

"నరేసరే. అందాన్ని అందమంటే పొగడ్త అవుతుందా? మల్లెపూవుని మల్లెపూవని అనక బీరపు వ్వని అనగలమా?"

తులసి పెదవులపై విరిసిన దోరనవ్వుని చూసి ఆ క్షణా మనసులోని పులకింతను పసిగట్టేశాననుకుని ఆనందపడ్డాడు రాంబాబు.

వంటపని ముగించి వచ్చిన అత్తయ్యను చూసి లేచి వెళ్ళాడు లోపలికి.

అమరునాడు చంద్రం వచ్చాడు. ఫ్రెండు గదిలో బట్టలబ్యాగ్ పెట్టుకుని వచ్చాడు. తిరుపతి రాయుడు 'అదేమిట్రా మనకింత ఇల్లు వుంటే అక్కడ దిగట మెందుకూ? ఇక్కడే వుండొచ్చు' అంటూ బాగ్ తెప్పించే శాడు.

చంద్రం, రాంబాబు ఇద్దరూ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైపోయారు. పగలంతా ఇద్దరూ మనుష్యుల్ని వెంటబెట్టుకుని తిరిగొస్తున్నారు. రాంబాబుకి మంచి వాగ్ధాటి వుంది. ఇంట్లో అందర్నీ మాటలతో ఎలా మురిపించాడో, అలాగే వేదిక నెక్కి మైకు ముందుకు వెళ్తే చాలు, మాటలగారడీతో జనాలను ఆకర్షించేవాడు.

ఆరోజు ముందుగా రాంబాబు వచ్చాడు ఇంటికి. అంతా హాల్లో కూర్చున్నారు. ఆ ఇంట్లో సంభాషణ అంతా ఎన్నికల గురించే జరుగుతూంటుంది రోజూ. చంద్రం సభలో ఎలా మాట్లాడాడో చెప్పి అందర్నీ నవ్వించాడు రాంబాబు.

"చంద్రం మెల్లగా మైకు దగ్గిరికి వచ్చి.....గొంతు సవరించుకుని సోదర సోదరీమణులారా..... అన్నాడు. అంతే నగంజనం లేచి వెళ్ళిపోయారు. మీకు నేను చెప్పబోయేదేమిటంటే...అంటే....అంటోండగానే మిగతా నగం జనం లేచిపోయారు!"

యాక్షన్ చేస్తూ రాంబాబు చెప్పిన తీరుకి అంతా పగలబడి నవ్వారు.

"నువ్వయితే ఎలా చెబుతావు బావా?" తులసి ఆసక్తిగా అడిగింది.

"చెప్పమంటావా?" గొంతు సవరించుకున్నాడు.

స్టేజి మీద నిలబడినట్లుగా అభినయించాడు.

"ఎందరో పెద్దలున్నారు. అందరికీ నావందనాలు! అన్నపూర్ణలాంటి తల్లులకి నాపాదాభివందనం! చిన్నారి చెల్లెళ్ళకు...చిట్టితమ్ముళ్ళకు నాశుభాకాంక్షలు!"

ఉత్సాహం ఆపుకోలేక గోపీ చప్పట్లు కొట్టేశాడు!

"మాటలతో మనసుల్ని పట్టుకోగలగాలిగానీ పాత చింతకాయపచ్చడి సోదరీసోదరీమణుల ఉపన్యాసం ఎవరు వింటారీరోజుల్లో!" రాంబాబు మాటలకి మళ్ళీ అంతా నవ్వారు.

గుమ్మం దగ్గిరేవున్న నన్నానయ్య అందుకున్నాడు.

"రాంబాబుగోరు మాటాడుతోంటే, మైకులోంచి విన్నో ళ్ళు రామారావు వచ్చాడనుకుని పరుగెట్టుకొచ్చారండి. ఆ తర్వాత రామారావుని మించి పోయాడీబాబు అను కున్నారండీ"

"బావా, ఏమిటీ నువ్వు సభలో అదరగొట్టేశావట?' నవ్వుతూ అడిగింది తులసి.

చంద్రం తనూ సరదాగా నవ్వేశాడు.

"అవును! ఇక మళ్ళీ స్టేజి అంటూ ఎక్కకూడదని నిర్ణయించేసుకున్నాను. ఏదో ఇంటింటికీ వెళ్ళి చెప్పటం వరకేగానీ ఉపన్యాసాల జోలికిపోను. నేను పనికి రానని తేలిపోయింది.! ఇక అందంతా రాంబాబు చూసుకోవ లసిందే!"

రాంబాబు మొహం ఆనందంతో వెలిగిపోయింది.

'తులసిని తమ ఇద్దరిలో ఎవరికి ఇవ్వాలా' అని మామయ్య ఈ ఇంట్లో వాళ్ళ అభిప్రాయం కోరితే నన్నానయ్యతో సహా అందరి వోట్లూ తనకే పడతాయ్! మనసులో గర్వంగా అనుకున్నాడు రాంబాబు.

తిరుపతిరాయుడిగారి ప్రత్యర్థి పాపానాయుడు కూడా బాగా పలుకుబడి, డబ్బు వున్నవాడు. తిరుపతిరాయు డు ఎన్నికలలో పోటీ చేయటం అదే మొదటిసారి. రాజకీయాలలో పాలు పంచుకుంటున్నా ప్రత్యక్షంగా ఎన్నికలలో ఎపుడూ దిగలేదు అప్పటివరకూ. ఆ రోజు వరకూ తిరుపతిరాయుగారిదే గెలుపు ఖాయమను కుంటున్నారు అందరూ.

కానీ ఎన్నికల తేదీ నాలుగు రోజులుందనగా టాక్ మారింది. పాపానాయుడి గెలుపు తథ్యమని ప్రచారం సాగింది. సభలు, సమావేశాలు, హరికథలు జోరు బాగా పెంచేశారు వాళ్ళు.

ఇద్దరూ డబ్బు బాగానే ఖర్చు పెడుతున్నారు. ఇంతలో ఓ విచిత్రం జరిగింది. రాంబాబు పాపానాయు డివైపు వెళ్ళిపోయాడు! తిరుపతి రాయుడి ఇంటినుండి మకాం మార్చేశాడు. ఇంట్లో వాళ్ళంతా ఆశ్చర్యంతో కొయ్య బారిపోయారు! బంధుత్వాన్ని కూడా లెక్కచేయకుండా అంతదగా ఎలా చేయగలిగాడని బాధపడ్డారు.

చంద్రం తిరుపతిరాయుడికి ధైర్యం చెప్పి తన శాయశక్తులా తిరుగుతున్నాడు అందరినీ కలువుకుని.

ఏ ప్రదేశాల్లో వేదిక నెక్కి తిరుపతిరాయుడి గుణగ ణాలను వర్ణించి ఓటు వెయ్యమని ప్రజలను అర్థించాడో, మళ్ళా అదే చోట నిస్సంకోచంగా రాంబాబు పాపానాయు డిని కీర్తిస్తూ పాపానాయుడిని గెలిపించమని కోరుతున్నాడు.

కారులో వస్తూ ఒకచోట మహోద్రేకంగా రాంబాబు చెబుతున్న ఉపన్యాసం విని తిరుపతిరాయుడు చాలా కృంగిపోయాడు. తనెలాంటివాడో తెలుసుకున్నందువ ల్లనే తనని వదిలి పాపానాయుడి పార్టీలో చేరి పనిచే స్తున్నానని రాంబాబు చెబుతున్నాడు.

ఇక ఆనాలుగు రోజులూ ఆయన ఇంటిపట్టునే వుండి పోయాడు. ప్రజలనాడిని తెలుసుకోవటంలో మహామహా వాళ్ళే తప్పటడుగువేస్తారని ఋజువైంది! ఫలితాలు తెలిసేసరికి తిరుపతిరాయుడే గెలిచాడు!

ఉదయమే తెలిసింది ఆ విషయం. తిరుపతిరాయు

# రాశి-వాసి

## కుంభం

జనవరి 20 వ తేదీ నుండి ఫిబ్రవరి 18 వ తేదీల మధ్య పుట్టిన వారు కుంభరాశి(అక్వారియస్) కి చెందుతారు. అంటే వారు పుట్టిన రోజున సూర్యుడు వారి జాతక చక్రంలో పదకొండవ రాశి అయిన కుంభంలో ఉంటాడన్నమాట. ఇది స్థిర రాశులలో ఒకటి. ఇది వాయు సంబంధమయిన రాశి. గ్రీక్ ఇతిహాసాల ప్రకారం దీని రాశ్యాధిపతి భూదేవి కుమారుడు, శని తండ్రి అయిన యురేనస్ గ్రహం.

ఈ యురేనియస్‌ను గ్రీక్‌లు వాయుదేవుడు అనికూడా అంటారు. ఈరాశివారి ఆలోచనలు అన్నీ కొత్తవిగానూ దృఢంగానూ ఉంటాయి. ముందు ముందు జరగబోయే సంగతులను వీరు సర్వ సాధారణంగా ఆలోచించి చెప్పగలరు. యురేనియస్ విధిని సూచించే గ్రహం కూడా. వీరి నిర్ణయాలు చాలా హఠాత్తుగా ఎవ్వరూ ఎదురు చూడని విధంగా ఉంటాయి. వీరు ఆధ్యాత్మిక చింతనకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. ఈరాశి వారు తరచూ కొత్తకొత్త ఆలోచనలు, కొత్తకొత్త పనులు చేస్తూంటారు. యురేనియస్ ప్రభావంవల్ల వీరి పనులు ఆలోచనలు, స్ఫురణలు చాలా చురుకుగా ఉంటాయి. దీనివల్ల వీరిలో ఒక విధమయిన ఆకర్షణీయమయిన సైకిక్ పర్సనాలిటీ ఉంటుంది. వీరు రాజకీయాల లోను, బాహ్య జీవితంలోనూ బాగా రాణిస్తారు. సూర్యుడు కుంభంలో ఉండటం వల్ల జాగ్రత్తతో కూడిన ఆలోచనలు, మనోనిగ్రహశక్తి, ఆర్థిక నిర్ణయాలు బాగా తీసుకుంటారు. వీరిలో ఆత్మస్థైర్యం అధికం.

ప్రకృతి సిద్ధంగా వీరు చాలా నెమ్మదస్తులు. శాంతిని కోరేవ్యక్తులు. పెద్దపెద్ద శబ్దాలు, అరుపులు, ఇతరులపై విమర్శలు వీరికి నచ్చవు. మంచి నైతిక విలువలతో తర్క నిపుణులుగా ఉంటారు. కానీ కొందరు వీరిని అర్థంచేసుకోలేక అపోహలతో వీరి నుండి విడిపోతూంటారు. అందువల్ల కోపంరావటం, అనవసరపు విషయాలలో మనస్సును కేంద్రీకరించడం వంటివి జరుగుతాయి. వీరు స్వతహాగా మంచి ఆలోచనాపరులు. ఈ ఆలోచనా ఒరవడిలో పడి అనవసరమయిన మానసికరుగ్మతలకు లోనవకుండా ఉండాలి. ఈ విషయంలో వీరు జాగ్రత్త వహించాలి.

**కుంభ రాశి భర్తలు**:- ఈ రాశి భర్తలు చాల దయామయులు. ప్రతి విషయంలోనూ చాల ఉదార స్వభావాన్ని ప్రదర్శిస్తారు. మిగిలినవారిలాగా కాక వీరు ఏవిధమయిన ప్రతిఫలం ఆపేక్షించక అందరిపట్లా ఉదారంగా ఉంటారు.

వీరి జీవితంలో పెళ్ళి అనేది ఒక లాంఛన ప్రాయం వంటిది. వీరికి వివాహ జీవితంలో పెద్ద శ్రమ ఉండదు. అందులోని కష్టనష్టాలను వీరు ఎంతో సులభంగా నెగ్గుకువస్తారు.

వీరిలోని ఒకేఒక బలహీనత ఏమిటంటే బయటి ప్రపంచంలోని వ్యక్తుల పట్ల ఎక్కువ శ్రద్ధను చూపి తమ ఇంట్లో భార్య బిడ్డల పట్ల అంత శ్రద్ధవహించకపోవడం. అందువల్ల వీరు అపార్థాలకులోనవుతారు. వీరి కుటుంబ వ్యక్తులు ఎల్లప్పుడూ వీరి ప్రేమకోసం పరితపిస్తారు. అదిలభించని కొందరు వీరిపై తిరగబడతారు. అందువల్ల గృహ జీవితంలో చిన్నచిన్న కలతలు కలహాలు రావచ్చు. వీరిని అనుసరించివెళ్ళే భార్యలు ఉంటే వీరి జీవితం ఆనందమయం అవుతుంది.

వీరు మిథునం, తుల, ధనుస్సు, మేషం, సింహం రాశి వారితో ఎక్కువ సఖ్యంగా ఉంటారు. సాంఘీక జీవితానికి ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. రాజకీయాలలో ఎక్కువగా రాణిస్తారు.

**కుంభరాశి వనితలు**:- ఈరాశి స్త్రీలు అందరికన్నా ఎంతో ఉన్నతమయిన ఆలోచనలతో ఉంటారు. వీరికి గృహ జీవితం అంటేనూ వివాహవ్యవస్థ అంటేను, ఎంతోగౌరవం. ఈమె ప్రతిభ బహు ముఖ ప్రతిభ అని చెప్పాలి. చురుకయిన ఆలోచనలు, పరిస్థితిని అనుసరించిపోవటం ఈమె గొప్పతనం. భర్త పనులు తనపనులు రెండింటిని చాల చురుకుగావిశ్రమ లేకుండా చెయ్యగల్గిన వ్యక్తిగా ఉంటుంది. ఈమె భర్తకు మంచి జీవిత భాగస్వామిగా ఉంటుంది. ఈమె నిర్వహణలో ఇల్లు కళకళలాడుతూంటుంది.

ఈ రాశి వనితలు అతిథిమర్యాదల పట్ల ఆకర్షితులై ఎక్కువమంది స్నేహితులు, బంధువులు తరచూ, వీరి ఇంటికి వస్తూ పోతూ వుంటారు. ఈమె భర్తను పూర్తిగా నమ్మి, అతనికి కావలసిన స్వాతంత్ర్యం ఇస్తుంది. ఈమె తన చుట్టూ ఉన్న వారిపై ఎంతో దయగా ప్రవర్తిస్తుంది.

ఈ రాశి వనితలు తరచూ ఉద్రేకాలకు లోనయినా వీరి మేధాశక్తి వీరిని ముందుకు నడిపిస్తుంది. వీరికి తగిన ఆలోచనా పరుడైన భర్తవుంటే వీరి జీవితం ఎంతో సుఖమయం అవుతుంది.

**కుంభరాశి పిల్లలు**:- ఈరాశి పిల్లలకు బిడియం ఎక్కువగా ఉంటుంది. వీరు ఎవరితోనూ కలిసి మెలిసి తిరగరు. ఈలోటుపాట్లను పెద్దలు వీరి బాల్యంలోనే సరిచెయ్యాలి. వీరు ప్రేమకు లొంగిపోతారు. వీరు పట్టినదే పట్టు. అయితే ఈ అలవాటు వీరు పెద్దవారయిన తర్వాత విజయానికి నాంది పలుకుతుంది.

**అదృష్ట సంఖ్య**:- వీరి అదృష్ట సంఖ్య 3. 12, 21, 30 తేదీలు మంచివి. బుధవారం అదృష్టమయిన రోజు. వీరికి ఇటుక ఎరుపు రంగు మంచిది.

— 'ఇంద్రాణి'

డిగారింటి ముందు కోలాహలం చెలరేగింది!

నిలువెత్తుదండతో వచ్చిన రాంబాబుని చూసి ఇంట్లో వాళ్ళంతా చేష్టలుడిగి నిలబడిపోయారు!

రాంబాబు మాత్రం తిరుపతిరాయుడి మెడలో దండ వేసి పాదాలకు నమస్కరించాడు. జనం అంతా వెళ్ళిపోయాక "పాపానాయుడి వైపు డబ్బుకోసం పనిచేయక తప్పలేదు మామయ్యా. కానీ మనసులో నీ గెలుపునే నేకోరుకున్నా. భగవంతుడు నా ప్రార్థన విన్నాడు!" అన్నాడు.

గుమ్మంలో రాంబాబు ఎక్కివచ్చిన క్రొత్త స్కూటరుంది. అదిచూసి రాయుడిగారు "కొన్నావా?" అనడిగారు. అవునన్నట్లుగా తలూపాడు. అర్థమైనట్లుగా ఆయన పెదవులపై చిరునవ్వు వచ్చింది.

"ఇంటికెళ్తున్నావా?" అని ఆయన అడిగితే రాంబాబు అవునన్నాడు.

"అయితే ఎల్లుండి మంచిరోజు. తులసిని నీకిచ్చి వివాహం చేయటానికి లాంఛనంగా మీ అమ్మనడగటానికి వస్తున్నానని చెప్పు. ఆరోజు పేరయ్య శాస్త్రిని ఇంటికి రమ్మను. లగ్నంకూడా నిర్ణయించుకోవచ్చు."

తిరుపతిరాయుడి మాటలకు అంతా నిర్విణ్ణులైపోయారు. రాంబాబే అందరికన్నా ముందుగా తేరుకుని ఆనందంగా మళ్ళీ మామయ్యకి నమస్కరించి, తులసివైపు ఓ కొంటె చూపు విసిరి వెళ్ళిపోయాడు.

"ఏమిటి మీరు చెప్పింది? మీకు మతి వుందా పోయిందా?" విమలమ్మ కోపంగా అడిగింది భర్తని.

"నేనంత తెలివి తక్కువ వాడిలా కనబడ్తున్నానా నీకు?"

"లేకపోతే ఏమిటి? వున్నన్ని రోజులూ మనదగ్గర వుండి, పాపానాయుడు గెలుస్తాడని అందరూ అనుకునే సరికి అక్కడికి గెంతేశాడు. సిగ్గులేకుండా, మీరు గెలిచేసరికి ఇటువచ్చాడు. పదిరూపాయల దండ మెళ్ళో వేసి, కాళ్ళకి దండం పెట్టేసరికి పొంగిపోయారా? చేసింది మర్చిపోయారా?"

"నేనిదంతా ఆలోచించలేదంటావా? రాంబాబు, చంద్రంలలో ఎవరికో ఒకరికిచ్చి చేయాలనుకున్నాం. రాంబాబుమనకి ద్రోహం చేశాడనుకుంటున్నావు. నేనూ మొన్నటివరకూ అలాగే అనుకున్నాను. కానీ అసలైన రాజకీయం తెలిసిన తెలివైన వాడని గ్రహించానిపుడే. అందుకే అమ్మాయినివ్వాలనుకుంటున్నాను. చంద్రం ఏదో ఉద్యోగంలో స్థిరపడ్తాడు. తిండికీ, బట్టకీ లోటులేకుండా చూసుకుంటాడు. చేయాలనుకున్నా అంతకు మించి ఏం చేయలేడు. రాంబాబు మాత్రం చొరవగా దూసుకుపోతాడు. కొద్ది సంవత్సరాల్లోనే మినిష్టరైపోయినా మనం ఆశ్చర్యపోనక్కర్లేదు. ఏపనిలో వున్నా ఉద్యోగంలో వున్నా ఎందులోనైనాసరే రెండుచేతులా సంపాదిస్తాడు. అమ్మాయి సుఖపడ్తుంది. సర్వసౌఖ్యాలూ అనుభవిస్తుంది. చంద్రాన్ని చేసుకుంటే వున్నదాంతో సంతృప్తిపడాల్సిందే!"

తిరుపతిరాయుడి మాటలను ఆశ్చర్యంగా వింది విమలమ్మ.

"అమ్మాయిని ఓమాట అడగకూడదూ?", నెమ్మదిగా అంది.

తిరుపతిరాయుడు మీసం మెలేసుకుంటూ చిద్విలాసంగా నవ్వాడు!

"అమ్మాయి నేను చెప్పింది ఎప్పుడైనా కాదనటం విన్నావా ఇన్నాళ్ళల్లో? పోనీ నాన్నా నాకిది కావాలని నోరు తెరిచి అడగటం విన్నావా ఇన్నేళ్ళల్లో! నా చిట్టి తల్లికి నేను చెప్పింది వినటమే కానీ కాదనటం తెలియదు. నోరు తెరిచి ఏమీ అడగని దానికి అన్నీ అమర్చిపెట్టాను ఇన్నాళ్లూ. ఇప్పుడూ అలాంటి భర్తనే నిర్ణయించాను."

విమలమ్మ నిట్టూర్చింది. భర్తమాట ఎలాంటి శిలాశాసనమో ఆవిడకు తెలుసు. అక్కడే బొమ్మలా నిలబడ్డ కూతురివైపు నిర్లిప్తంగా చూసి లోపలికి వెళ్ళిపోయింది.

ఊరేగింపు సన్నాహం చూడటానికి వెళ్ళాడు చంద్రం. ఆబాబు ఈ సమయంలో లేకపోవటం మంచిదే అయింది. విని వుంటే ఎంత బాధపడునో అనుకున్నాడు మనసులో సన్నాసయ్య.

మరునాడు హాల్లో పడక కుర్చీలో పడుకుని వున్న తిరుపతిరాయుడి దగ్గరకు వచ్చాడు సన్నాసయ్య.

చేతులునులుముకుంటూనిలబడ్డాడు. "ఏమిటి?" వాడివాలకం అర్థంకాక అడిగాడాయన.

"మరండి....తులసమ్మగారు... అదేనండి ఎపుడూ ఏదీ కావాలని నోరు తెరిచి అడగని మనమ్మాయిగారండీ..."

"ఏమిట్రా వెధవా ఆవాగుడు? సరిగ్గా చెప్పి ఏడువు!" గర్జించారు రాయుడుగారు.

"తులసమ్మగారు, చంద్రంబాబు బస్టాండు దగ్గరకనబడి ఈ చీటీ మీకియ్యమన్నారండి" కాగితం అందించాడు.

అయోమయంగా తెరిచి చూశాడాయన.

"నాన్నా నీకు తగిన రాజకీయవారసుడిని అల్లుడిగా ఎన్నిక చేశావు నువ్వు. కానీ నాఒటు సంతృప్తికరమైన జీవితానికే. అందుకే చంద్రం బావతో వెళ్తున్నాను. ఎల్లుండి ఇద్దరం దంపతులమైవస్తాం. ఆశీర్వదిస్తావని ఆశిస్తాను"

— నీకూతురు
తులసి.